సాక్షి ఖమ్మం

గురువారం । 27 । జూలై । 2023



హుండీ ఆదాయం రూ.1.70కోట్లు

భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయం హుండీల్లో కానుకలను లెక్కించగా రూ.1.70కోట్ల ఆదాయం నమోదైంది. 10లో



డీఆర్ఎం తనిఖీలు

కొత్తగూడెం రైల్వేస్టేషన్‌తో పాటు పలుచోట్ల బొగ్గు లోడింగ్ పాయింట్లను రైల్వే డివిజనల్ మేనేజర్ భరతేష్‌కుమార్ తనిఖీ చేశారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
27° / 24°

వాతావరణం

జిల్లాలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో గురువారం వర్షం కురుస్తుంది. కొన్నిచోట్ల భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

వరదలపై ఎంపీ నామా ఆరా

ఖమ్మంమయూరిసెంటర్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కురుస్తున్న వర్షాలు, వరదలపై బీఆర్ఎస్ లోక్ సభాపక్ష నేత, ఎంపీ నామ నాగేశ్వరరావు బుధవారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్లకు ఫోన్ చేసి వివరాలు ఆరా తీశారు. అన్ని చోట్ల రిజర్వాయర్లు, చెరువుల్లో గరిష్టస్థాయి నీరు చేరినందున ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. వాగులు, వంకల వరద రహదారులపైకి చేరినందున ప్రజలు దాటకుండా చూడాలని తెలిపారు. ఇక భద్రాచలంలో రెండో ప్రమాద హెచ్చరిక స్థాయికి గోదావరి చేరినందున ప్రజలను అప్రమత్తం చేయాలని ఎంపీ నాగేశ్వరరావు సూచించారు.

బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్ మధుసూదన్



అదనపు కలెక్టర్‌కు శుభాకాంక్షలు చెబుతున్న ఏఓ, ఉద్యోగులు

ఖమ్మం సహకారనగర్: జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా డి.మధుసూదన్ నాయక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వర్తించిన నూతి మధుసూదన్ హైదరాబాద్‌కు బదిలీ కావడంతో మంచిర్యాలలో పనిచేస్తున్న మధుసూదన్ నాయక్‌ను ప్రభుత్వం నియమించింది. ఈక్రమంలో ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా, అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన మధుసూదన్‌నాయక్‌ను అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా, డీఆర్వో శిరీష, కలెక్టరేట్ ఏఓ అరుణ, ఉద్యోగులు సత్యనారాయణ, మదన్‌గోపాల్ తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

డీవైఎస్ఓగా సునీల్‌కుమార్‌రెడ్డి



సునీల్‌కుమార్‌రెడ్డి

ఖమ్మం స్పోర్ట్స్: కొంత కాలంగా జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి పోస్టుపై నెలకొన్న ప్రతిష్టంభనకు తెరపడింది. ఎట్టకేలకు డీవైఎస్ఓగా టి.సునీల్ కుమార్‌రెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అలాగే, ఇక్కడ డీవైఎస్ఓగా ఉన్న ఎం.పరంధామరెడ్డి భద్రాద్రి జిల్లాకు బదిలీ చేశారు. ఈవిషయమై తెలంగాణ రాష్ట్ర సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ ఎంప్లాయిమెంట్ ప్రమోషన్ చైర్మన్ సవ్యసాచి ఘోష్ ఉత్తర్వులు విడుదల చేశారు.

డిగ్రీలో ప్రవేశాల గడువు పొడిగింపు

ఖమ్మం సహకారనగర్: దోస్త్ సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకుని మూడు విడతల్లో డిగ్రీలో ప్రవేశాలు పొందిన విద్యార్థుల సర్టిఫికెట్లను ఈనెల 28వ తేదీ వరకు పరిశీలించుకునే అవకాశం కల్పించారు. భారీ వర్షాల కారణంగా గడువు పొడిగించినట్లు ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా తెలిపారు. ఈమేరకు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ర్యాగింగ్‌కు పాల్పడకుండా అవగాహన

ఖమ్మంలీగల్: వృత్తి విద్యా కళాశాలల్లో తరగతులు మొదలుకానున్న నేపథ్యాన విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడకుండా అవగాహన కల్పించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా సూచించారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యాన గ్రామాల్లో సేవలందిస్తున్న జెండర్ కమిటీ సభ్యులతో న్యాయమూర్తి బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడటం నేరమని, దీనికి ఆరు నెలల నుంచి జీవితఖైదు వరకు శిక్ష పడే అవకాశం ఉందనే విషయమై విద్యార్థులకు వివరించాలని తెలిపారు. కాగా, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ద్వారా గ్రామాల్లో న్యాయసేవలపై అవగాహన కల్పించడానికి పారాలీగల్ వలంటీర్లుగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన చెప్పారు.

నేటి నుండి టీ9-30 టికెట్

ఖమ్మం మామిళ్లగూడెం: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో స్వల్పదూరం ప్రయాణించే వారి కోసం టీఎస్ ఆర్టీసీ మరో రాయితీ పథకాన్ని ప్రకటించింది. పల్లెవెలుగు బస్సుల్లో ప్రయాణించేలా టీ9-30 టికెట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈమేరకు రూ.50 చెల్లిస్తే 30 కి.మీ. పరిధిలో వచ్చివెళ్లే వెసలుబాటు ఉంటుంది. గురువారం నుంచి అమల్లోకి వచ్చే ఈ టికెట్ ఉదయం 9నుండి రాత్రి 9గంటల వరకు చెల్లుబాటవుతుంది. ఖమ్మం రీజియన్ ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచించారు.

కుండపోత

జిల్లాను వర్షం ముంచెత్తుతోంది. మూడురోజులుగా కురుస్తున్న కుండపోత వర్షంతో జిల్లా జలమయమైంది. రహదారులపైకి వరద చేరడమే కాక లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి నీళ్లు వచ్చాయి. మరోవైపు నదులు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రిజర్వాయర్లలోకి ఎగువ నుంచి వచ్చే వరద పెరుగుతుండగా.. పాలేరు, వైరా రిజర్వాయర్ల నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. పాలేరు రిజర్వాయర్ సామర్థ్యం 23 అడుగులు దాటి అలుగు పోస్తోంది. ఇక వైరా రిజర్వాయర్ సామర్థ్యం 18.3 అడుగులు కాగా.. పూర్తిస్థాయి దాటి అలుగు పడింది. ఖమ్మంలోని మున్నేరు 15.5 అడుగుల వద్ద ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో మున్నేరు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తూ పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. – సాక్షిప్రతినిధి, ఖమ్మం



ఖమ్మంలో మున్నేరు ప్రవాహం (ఇన్‌సెట్) 15 అడుగులు దాటిన నీటిమట్టం

జిల్లాలో ఏకధాటిగా కురుస్తున్న వర్షం

- రిజర్వాయర్లలోకి పోటెత్తుతున్న వరద
- అలుగు పారుతున్న పాలేరు, వైరా రిజర్వాయర్లు
- ఖమ్మంలోని మున్నేరులోకి భారీగా చేరుతున్న నీరు

జలమయం

ఉధృతంగా కురుస్తున్న వర్షంతో జిల్లాలోని రహదారులన్నీ జలమయమయ్యాయి. పలు గ్రామాల్లో రహదారులపైకి నీళ్లు రావడంతో రాకపోకలు స్తంభించాయి. ఖమ్మంలోని పాత బస్టాండ్, మయూరి సెంటర్ తదితర ప్రాంతాల్లో రోడ్డుపై వరద పారుతోంది. నేలకొండపల్లి మండలంలోని ముఠాపురంలో ఎస్సీ కాలనీలో ఇళ్లల్లోకి వరద చేరింది. ఏన్కూరు మండలంలో భారీ వర్షాలకు పంటలు నీట మునగడంతోపాటు రోడ్లు దెబ్బతిన్నాయి. ముదిగొండ మండలం గంధసిరి గ్రామంలో మున్నేరు ఉధృతికి శ్మశాన వాటిక మునిగింది. తిరుమలాయపాలెం మండలం అజ్మీరాతండా వద్ద ఆకేరు ఉధృతంగా ప్రవహిస్తుండగా.. సత్తుపల్లి తామర చెరువు, నేలకొండపల్లి మండలంలోని చెరువు మాదారం చెరువు, కారేపల్లి మండలంలోని గాదెపాడు చెరువు, కారేపల్లిలోని పెద్ద చెరువు, సుబ్బయ్యకుంట, కంబాలకుంట తదితర చెరువులు అలుగు పోస్తున్నాయి.

రిజర్వాయర్లలోకి వరద ఉధృతి

జిల్లాలోని పాలేరు రిజర్వాయర్‌కు భారీగా వరద వస్తోంది. ఫుల్ రిజర్వాయర్ లెవెల్ 23 అడుగులు కాగా.. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 23.3 అడుగుల నీరు ఉంది. 11,504 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌లోకి వస్తోంది. సాగర్ ఎడమ బ్రాంచ్ కెనాల్‌కు 526 క్యూసెక్కులు, పాలేరు చానల్‌కు 200 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా పాలేరు రిజర్వాయర్‌ను నీటి పారుదల శాఖ సీఈ శంకర్‌నాయక్ పరిశీలించారు. వైరా రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి మట్టం 18.3 అడుగులు కాగా ప్రస్తుతం 19 అడుగుల నీరు ఉంది. 795 క్యూసెక్కుల నీళ్లు రిజర్వాయర్‌లోకి ఇన్‌ఫ్లో ఉంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం దాటడంతో అలుగు పోస్తోంది. అలాగే లంకాసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు వస్తోంది. బేతుపల్లి చెరువు, జాలిముడి ప్రాజెక్టులు పూర్తిగా నిండడంతో పొంగి పొర్లుతున్నాయి.

నిండుతున్న చెరువులు

ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని చెరువుల్లోకి నీళ్లు చేరాయి. ఈనెల 1వ తేదీన నీళ్లు లేక వెలవెలబోయిన చెరువులు ఇప్పుడు నిండుకుండల్లా మారాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షంతో పంటలకు ఊపిరి పోసినట్లయింది. జిల్లాలో మొత్తం 983 చెరువులకు గాను ఈనెల 1న 728 చెరువులు 25 శాతం కూడా నిండలేదు. ఇక 4వ తేదీన 25 శాతం కూడా నీరు లేని చెరువుల సంఖ్య 773కు చేరింది. దీంతో ఈ ఏడాది పంటల సాగుపై రైతుల్లో అయోమయం నెలకొంది. అయితే, ఈనెల రెండో వారం నుంచి కురుస్తున్న వర్షాలతో చెరువుల్లోకి క్రమంగా నీరు చేరుతోంది. ఈనెల 21న 435 చెరువులు 25 శాతంలోపు నిండగా.. ఐదు చెరువులు మత్తడి పోశాయి. ఆ తర్వాత పరిస్థితి పూర్తిగా మారింది. బుధవారం నాటికి 92 చెరువుల్లో 25 లోపు నీళ్లు ఉండగా.. 299 చెరువుల్లో 50 శాతం లోపు, 219 చెరువుల్లో 75 శాతం లోపు, 270 చెరువుల్లో నూరు శాతం లోపు నీళ్లు ఉన్నాయి. ఇక 103 చెరువులు మత్తడి పోస్తుండడం విశేషం.

బుధవారం అత్యధికంగా నమోదైన వర్షపాతం (సెం.మీ.)

గేట్ కారేపల్లి	లింగాల	రఘునాథపాలెం	గుబ్బగుర్తి	మంచుకొండ	తల్లాడ	ఏన్కూరు	వైరా	పల్లెగూడెం	కొణిజర్ల
15.2	12.5	10.3	10.0	8.5	8.1	7.9	7.1	6.7	6.4

అప్రమత్తంగా ఉండాలి

గత నాలుగైదు రోజుల నుండి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సూచించారు. అలాగే, ప్రజలు ఆందోళనకు గురి కావాల్సిన పని లేదని తెలిపారు. అయితే, ఎలాంటి పరిస్థితి ఎదురైనా ఎదుర్కొనేలా అన్ని శాఖల అధికారులు, సిబ్బందిని సమాయత్తం చేశామని చెప్పారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, వరదల ప్రభావంతో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టరేట్, రెవెన్యూ డివిజనల్, మున్సిపల్ కార్యాలయాల్లోని కంట్రోల్ రూమ్‌లకు వచ్చే ఫోన్లపై సత్వరమే స్పందించి ప్రజలకు సాయమందించాలని మంత్రి తెలిపారు.

రిజర్వాయర్ల వివరాలు (అడుగుల్లో)

జలాశయం	నిల్వ సామర్థ్యం	ప్రస్తుతం నీరు
పాలేరు	23	23.03
వైరా	18.03	19.00
లంకాసాగర్	16	13.01
జాలిముడి	15	16.06

జిల్లాకు రెడ్‌అలెర్ట్ !

రానున్న 48గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు



టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన సీపీ వారియర్, అధికారులు

ఖమ్మం సహకారనగర్: వాతావరణ శాఖ జిల్లాకు రెడ్ అలర్ట్ ప్రకటించిన నేపథ్యాన జిల్లాలో రానున్న 48 గంటల పాటు భారీ నుండి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ వెల్లడించారు. ఈమేరకు ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి బుధవారం ఆయన పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్‌తో కలిసి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వాతావరణ శాఖ సూచనల ప్రకారం జిల్లాలో 40 సెం.మీ. పైగా వర్ష సూచన ఉన్నందున అధికారులు సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షిస్తూ ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలని తెలిపారు. వాగులు పొంగుతున్న చోట రాకపోకలు నిలిపివేయాలని, ప్రమాదకరంగా ఉన్న చెరువు కట్టల వద్ద ఇసుక బస్తాలు సిద్ధం చేయాలని, లోతట్టు ముంపు ప్రదేశాల్లో ఇళ్ల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని చెప్పారు. అనంతరం సీపీ వారియర్ మాట్లాడుతూ పోలీస్ అధికారులు స్థానికంగా ఉంటూ సహాయక చర్యలను పర్యవేక్షిస్తూ పాలుపంచుకోవాలని ఆదేశించారు.



వైరా రిజర్వాయర్ రెండో అలుగు ద్వారా బయటకు వెళ్తున్న వరద

పాలేరుకు తగ్గని వరద

కాల్వల ద్వారా దిగువకు విడుదల

కూసుమంచి: ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో మండలంలోని పాలేరు రిజర్వాయర్‌కు భారీగా వరద చేరుతుంది. దీంతో రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టమైన 23 అడుగులు దాటగా పొంగి పొర్లుతోంది. రిజర్వాయర్‌కు ఎగువన ఉన్న వాగులు ఉప్పొంగడంతో బుధవారం సాయంత్రానికి 7వేల క్యూసెక్కుల మేర వరద రిజర్వాయర్‌లోకి చేరుతోంది. ఈమేరకు పాలేరు రిజర్వాయర్‌ను జల వనరుల శాఖ సీఈ శంకర్‌నాయక్ పరిశీలించి లోతట్టు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ఈఈ వెంకటేశ్వర్లు, డీఈఈలు మధు, రత్నకుమారి, మన్మథరావు, తహసీల్దార్ శకుంతల, సీఐ జితేందర్‌రెడ్డి, ఎస్సై రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

దిగువకు నీటి విడుదల

ఖమ్మంఅర్బన్: పాలేరు రిజర్వాయర్‌లోకి భారీగా వరద చేరుతూ గరిష్ట స్థాయికి చేరగా, అలుగు ద్వారా దిగువకు పారుతోంది. అయితే, నీటిని వృథాగా వాగులోకి కలవడం కంటే కాల్వలకు విడుదల చేసి 17 మండలాల పరిధిలోని చెరువుల్లోకి మళ్లించాలని జలవనరుల శాఖ అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా ఎడమ కాల్వకు వెయ్యి క్యూసెక్కులు, పాలేరు పాత కాల్వకు 200 క్యూసెక్కుల నీటిని బుధవారం విడుదల చేశారు.



రిజర్వాయర్ వద్ద సీఈ శంకర్‌నాయక్, అధికారులు



అలుగు పోస్తున్న వైరా రిజర్వాయర్

అలుగు పోస్తున్న వైరా రిజర్వాయర్

వైరా: ఎడతెరిపి లేని వర్షాలతో వాగులు, వంకల ద్వారా వైరా రిజర్వాయర్‌లోకి భారీగా వరద చేరుతోంది. ఇప్పటికే పూర్తిస్థాయి నీటి మట్టమైన 18.3 అడుగులు దాటింది. బుధవారం సాయంత్రం 19 అడుగులకు నీటిమట్టం చేరుకోగా, 2,300 క్యూసెక్కుల నీరు అలుగుల ద్వారా బయటకు వెళ్తోంది. ఈమేరకు అధికారులు రిజర్వాయర్ కుడి, ఎడమ కాల్వల ద్వారా నీటి విడుదలకు సిద్ధమయ్యారు.

రామయ్యకు స్నపన తిరుమంజనం

భద్రాచలం: భద్రాచలంలో శ్రీసీతారామ చంద్రస్వామివారి ఉత్సవమూర్తులకు బుధవారం అర్చకులు స్నపన తిరుమంజనం కమనీయంగా జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా జరిపారు.

కేజీబీవీ తరగతి గదులు, ఆవరణలోకి వరద

కారేపల్లి: భారీ వర్షాలతో కారేపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయం తరగతి గదుల్లోకి బుధవారం రాత్రి నీరు చేరింది. అలాగే, విద్యాలయ ప్రాంగణంలో నడుము లోతు నీరు నిలిచింది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు బయటకు రాలేక ఆందోళన చెందుతున్నారు. విద్యార్థులందరినీ పాత శాల పైఅంతస్తులోని డార్మెటరీకి చేర్చగా బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

ఉధృత గోదావరి

- ఎగువ నుంచి వస్తున్న వరదతో భద్రాద్రిలో గోదావరి పరవళ్లు
- రాత్రి 9గంటలకు 48అడుగులు దాటడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- ముంపు ప్రాంతాల్లో పర్యటించిన ప్రత్యేక అధికారి అనుదీప్, కలెక్టర్ ప్రియాంక
- రాత్రి 12గంటలకు 48.8 అడుగులకు చేరిన గోదావరి



భద్రాచలం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి



ముంపునకు గురైన విస్తా కాంప్లెక్స్, నిత్యాన్నదానసత్రం

భద్రాచలం: భద్రాచలం వద్ద గోదావరి వరద తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరుగుతోంది. రెండు రోజులుగా కొద్దిమేర హెచ్చు తగ్గులతో స్థిరంగా ఉంది. అయితే, మంగళ, బుధవారాల్లో కురిసిన భారీ వర్షాలతో ఎగువన ఉన్న ప్రాజెక్టులు, చర్లలోని తాలిపేరు నుంచి గోదావరిలోకి నీరు విడుదల చేస్తున్నారు. దీంతో బుధవారం ఉదయం 5 గంటలకు 39.2 అడుగులుగా ఉన్న నీటిమట్టం, మధ్యాహ్నం 12 గంటలకు 41.80, 2గంటలకు 43.50 అడుగులకు చేరుకుంది. ఈమేరకు అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. సాయంత్రం 4 గంటలకు 44.90 అడుగులు, రాత్రి 9.30గంటలకు 48 అడుగులకు చేరగా రెండో ప్రమాద హెచ్చరిక కూడా జారీచేశారు. ఇక రాత్రి 12 గంటలకు 48.8 అడుగులుగా గోదావరి నీటిమట్టం నమోదైంది.

వారంలో మూడుసార్లు మొదటి ప్రమాద హెచ్చరిక

భద్రాచలం వద్ద గోదావరి 43 అడుగులు వస్తే మొదటి, 48 అడుగులకు రెండో, 53 అడుగులుకు మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. ఈ ఏడాది జూలైలో వారం వ్యవధిలోనే అధికారులు మూడు సార్లు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. తొలుత ఈ నెల 20న ఉదయం 43.30 అడుగులు రావడంతో తొలిసారి జారీ చేయగా.. 21న 43.90 అడుగులకు చేరిన గోదావరి క్రమేపీ తగ్గింది. ఇక మళ్లీ 23న ఉదయం 43.10 అడుగులకు రావడంతో రెండో సారి, బుధవారం వేగంగా పెరిగిన గోదావరి సాయంత్రం 4 గంటలకు 43.5 అడుగులకు చేరుకోవడంతో మూడోసారి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఆతర్వాత రాత్రి 9.30గంటలకు 48అడుగులు దాటడంతో రెండో ప్రమాద హెచ్చరిక కూడా జారీ చేయడం గమనార్హం.

విస్తా కాంప్లెక్స్, నిత్యాన్నదాన సత్రంలోకి వరద

రెండు రోజులుగా కురుస్తున్న వర్షం, కరకట్ట వద్ద నున్న స్లూయిజ్‌లను మూసివేయడంతో రామాలయం చెంతన విస్తా కాంప్లెక్స్, నిత్యాన్నదాన సత్రం చుట్టూ నీరు చేరింది. అన్నదాన సత్రంలోకి సైతం నీరు ప్రవేశించింది. దీంతో అధికారులు స్లూయిజ్‌ల వద్ద 16 మోటార్లతో వరద నీటిని గోదావరిలోకి ఎత్తిపోస్తున్నారు. వారం వ్యవధిలోనే రెండు సార్లు విస్తా కాంప్లెక్స్‌లోని దుకాణాలను వరద ముంచెత్తటంతో చిరు వ్యాపారులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

ఏజెన్సీలో పర్యటించిన ప్రత్యేకాధికారి అనుదీప్, కలెక్టర్ ప్రియాంక

గోదావరి వరదలకు ప్రత్యేకాధికారిగా నియమించిన హైదరాబాద్ కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ భద్రాచలం ఏజెన్సీలో వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. తాలిపేరు ప్రాజెక్టు ఉధృతిని, విస్తా కాంప్లెక్స్ వద్ద స్లూయిజ్ ప్రాంతాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. నన్నపునేని మోహన్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించి బాధితులతో మాట్లాడారు. అలాగే, భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక అలా సైతం చర్ల మండలంలో పర్యటించారు. మండలంలోని తాలిపేరు ప్రాజెక్టును పరిశీలించి వస్తున్న వరద, విడుదలపై ఆరా తీశారు. ఇంకా వర్షంలోనే భద్రాచలంలో గోదావరి ఉధృతిని ఎమ్మెల్యే పోదెం వీరయ్య పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.

ఇంకా పెరగొచ్చు..

స్థానికంగా కురుస్తున్న భారీ వర్షాలకు తోడు ఎగువన ప్రాజెక్టుల వద్ద నుంచి వరదను గోదావరిలోకి వదులుతుండటంతో నీటిమట్టం మరింత పెరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. మేడిగడ్డ, సమ్మక్క సారక్క ప్రాజెక్టుల నుంచి వస్తున్న నీటికి తోడు చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు నుంచి సుమారు 2 లక్షల క్యూసెక్కుల నీరు వదులుతున్నారు. భద్రాచలం వద్ద గోదావరికి దిగువన ఉన్న ఉపనది శబరికు వరద పోటెత్తుతోంది. మరో రెండు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలుపుతుండటంతో గోదావరి నీటి ప్రవాహం ఇంకా పెరగొచ్చని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు.

రుణ లక్ష్యాలను చేరుకోవాలి



వార్షిక ప్రణాళికను విడుదల చేస్తున్న కలెక్టర్ గౌతమ్, అధికారులు

బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: బ్యాంకులకు ప్రభుత్వం నిర్దేశిత లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన జిల్లా స్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 6,579 మంది రైతులకు 134,00 ఎకరాలకు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు జారీ చేశామని.. వీటి వివరాలు ధరణిలో ఉండవని తెలిపారు. అయితే, రైతులు సంప్రదించినప్పుడు జాబితా ఆధారంగా పంట రుణాలు మంజూరు చేయాలని తెలిపారు. ఆతర్వాత పరిశ్రమలు, విద్యారుణాలు, ఎస్సీ, ఎస్టీలు, మహిళా సంఘాలకు ఇచ్చిన రుణాలపై సమీక్షించారు. కాగా, ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఏర్పరచుకున్న పేదలకు పట్టాలు ఇస్తున్నందున వారికి సైతం గృహ నిర్మాణ రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం 2023–24కు నిర్దేశించిన వార్షిక రుణప్రణాళిక విడుదల చేశారు. ఈ ప్రణాళిక ఆధారంగా జిల్లాలో రూ.6,432.40 కోట్ల రుణ లక్ష్యం నిర్ణయించగా.. ఇందులో వ్యవసాయరంగానికి రూ.4,966.66 కోట్లు ఇవ్వాల్సి ఉందని కలెక్టర్ తెలిపారు. అలాగే, సూక్ష్మ రుణ ప్రణాళికకు రూ.520.64 కోట్లు, విద్యారంగానికి రూ.236.60 కోట్లు, గృహ నిర్మాణానికి రూ.464.40 కోట్లు, ఇతర మౌలిక వసతులకు రూ.31.45 కోట్లు, సోలార్ ఎనర్జీ సంబంధించి రూ.18.38 కోట్లు బ్యాంకుల ద్వారా ఇచ్చేలా ప్రణాళికలో పొందుపర్చినట్లు చెప్పారు. ఎల్‌డీఎం శ్రీనివాసరెడ్డి, ఆర్‌బీఐ ఎల్‌డీఓ వైభవ్‌వ్యాస్, నాబార్డ్ డీపీ సుజిత్, బ్యాంకుల అధికారులు విజయ్‌కుమార్, విజయ్‌భాస్కర్‌గౌడ్, అచ్యుత్ శ్రీరామ్, వీరబాబు, డీఆర్డీఓ విద్యాచందన, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కృష్ణానాయక్, పశుసంవర్ధక శాఖ అధికారి వేణుమనోహర్, డీఏఓ విజయనిర్మల, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నవీన్‌బాబు పాల్గొన్నారు.

గుడ్ మెమోరీస్ !

మంత్రి పువ్వాడ ట్వీట్‌కు కేటీఆర్ స్పందన



ఖమ్మంమయూరిసెంటర్: 2010లో ఖమ్మంలోని మమత మెడికల్ కళాశాల వార్షికోత్సవానికి మంత్రి కేటీఆర్ హాజరైన విషయాన్ని గుర్తు చేస్తూ నాటి ఫొటోలను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ బుధవారం పోస్ట్ చేశారు. మంత్రి కేటీఆర్ అజయ్, పువ్వాడ నాగేశ్వరరావు మాట్లాడుతున్న ఫొటో, ఇతర ఫొటోలను పోస్ట్ చేయగా.. మంత్రి కేటీఆర్ 'గుడ్ మెమోరీస్' అంటూ రీ ట్వీట్ చేశారు.

క్లుప్తంగా

విధుల్లో చేరిన ఆర్డీఓ స్వర్ణలత

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం ఆర్డీఓగా కె.స్వర్ణలత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఆర్డీఓగా విధులు నిర్వర్తించిన ఎం.వీ.రవీంద్రనాథ్ తొర్రూరుకు బదిలీ చేయగా, కొత్తగూడెం ఆర్డీఓ స్వర్ణలతను ఖమ్మంకు కేటాయించారు. ఈమేరకు ఆమె విధుల్లో చేరగా, కార్యాలయం ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

బీసీ గురుకులాల్లో స్పాట్ అడ్మిషన్లు

ఖమ్మంమయూరిసెంటర్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మహాత్మా జ్యోతిబాపూలే తెలగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల గురుకుల కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు ఆర్సీఓ జ్యోతి తెలిపారు. జిల్లాలో 11 బాలికలు, 11 బాలుర కళాశాలలు ఉండగా.. ఖాళీ సీట్లను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. బాలురకు రఘునాథపాలెంలోని ఎస్ఎస్ మూర్తి పాలిటెక్నిక్ కళాశాలలో, బాలికలకు రఘునాథపాలెంలోని శారద ఇంజనీరింగ్ కళాశాలలో కౌన్సెలింగ్ ఉంటుందని, విద్యార్థులు హాల్‌టికెట్, మెరిట్ కార్డ్‌తో 28న ఉదయం 10 గంటల వరకు చేరుకోవాలని సూచించారు.

సీసీఎస్ సీఐగా బాలాజీ

ఖమ్మంక్రైం: ఖమ్మం సీసీఎస్ సీఐ-1గా బి.బాలాజీని నియమించారు. ప్రస్తుతం ఆయన గార్లబయ్యారం సీఐగా విధులు నిర్వర్తిస్తుండగా సీసీఎస్‌కు బదిలీ చేస్తూ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. అలాగే, వెయిటింగ్‌లో ఉన్న ఎన్.వెంకటేశ్వర్లును ఖమ్మం వీఆర్‌కు కేటాయించారు. కాగా, త్వరలోనే మరికొందరు సీఐలకు బదిలీ ఉంటుందని సమాచారం.

కాంగ్రెస్ శ్రేణులు సహాయక చర్యల్లో పాల్గొనాలి

ఖమ్మంమయూరిసెంటర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమైనందున సహాయ చర్యల్లో కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు పాల్గొనాలని పార్టీ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. వసతి సౌకర్యాలు ఏర్పాటు చేయడంతో పాటు ఆహారం, తాగునీటి సౌకర్యం కల్పించాలని, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని కారణంగా ఆస్పత్రులకు చేర్చడంతో సహకరించాలని తెలిపారు.

'బెహతర్ భారత్'లో జిల్లా నాయకులు



సమావేశంలో సంతోష్, నవీన్‌రెడ్డి తదితరులు

ఖమ్మం సహకారనగర్/మధిర/కూసుమంచి: బెంగళూరులో యూత్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన బుధవారం మొదలైన 'బెహతర్ భారత్' సమావేశాలకు జిల్లా నుంచి పలువురు నాయకులు హాజరయ్యారు. యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్లపల్లి సంతోష్, నాయకులు తుమాటి నవీన్‌రెడ్డి, బొల్లం మహేష్, ఉపేందర్, హృదయ్ కిరణ్, బెల్లంకొండ శరత్ తదితరులు పాల్గొన్నారు. ఈనెల 28వ తేదీ వరకు జరిగే ఈసమావేశాల్లో రాజకీయాల్లో యువత పాత్ర, జాతీయ యూత్ డిక్లరేషన్‌పై కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకత్వం చర్చించి నిర్ణయాలు వెలువరిస్తుందని సంతోష్ తెలిపారు.

జనావాసాల్లోకి చుక్కల దుప్పి



స్టాండ్‌లో చిక్కుకున్న చుక్కల దుప్పి

సత్తుపల్లిటౌన్: అటవీ ప్రాంతం నుంచి ఓ చుక్కల దుప్పి సత్తుపల్లి జనావాసాల్లోకి చేరింది. కాకర్లపల్లి బీట్‌లోని తామర చెరువు వైపు నుంచి పాత ఎన్టీఆర్ కాల్వలోకి చుక్కల దుప్పి వచ్చింది. ఈక్రమంలో స్థానికులు ఆసక్తి చూస్తుండడంతో అది ద్వారకాపురి కాలనీ, జవహర్‌నగర్, జంగాల కాలనీ మీదుగా రాజీవ్ రోడ్డు వైపు పరుగులు తీసింది. ఈక్రమంలో యాదగిరి నివాసంలోని స్టాండ్‌లో చిక్కుకుని ఆగినా.. ఆతర్వాత మళ్లీ అడవిలోకి పరుగులు తీసింది. ఈవిషయం తెలుసుకున్న అటవీ శాఖాధికారులు వన్యప్రాణులకు హానీ తలపెట్టొద్దని సూచిస్తూ ఆయా కాలనీల్లో మైక్ ద్వారా ప్రచారం నిర్వహించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మిర్చి	19,700	13,500
ఏసీ మిర్చి	24,050	18,500
పత్తి	7,100	5,950

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.12,623

మాదక ద్రవ్యాల కట్టడి
అందరి బాధ్యత



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన సీపీ వారియర్, డీఎఫ్ఓ సిద్ధార్థ్, అదనపు కలెక్టర్ మధుసూదన్

- కలెక్టర్ వీ.పీ.గౌతమ్
- కలెక్టరేట్‌లో నార్కోటిక్స్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం

ఖమ్మం సహకారనగర్: మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా స్థాయి నార్కోటిక్స్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల సరఫరా మూలాలను కట్టడి చేస్తేనే లక్ష్యాన్ని చేరుకోవటం వీలవుతుందన్నారు. ఈమేరకు అన్ని శాఖల అధికారులు సమష్టిగా కృషి చేస్తూనే ప్రజల సహకారం తీసుకోవాలని తెలిపారు. పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగాన్ని కట్టడి చేయకుంటే భవిష్యత్తులో సమాజంపై తీవ్ర దుష్ప్రభావం చూపుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, అదనపు డీసీపీ ఏఎస్‌సీ.బోస్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేందర్‌రెడ్డి, ఏసీపీ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి

ఎన్నికలకు సంబంధించి నోడల్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండి సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ గౌతమ్ అన్నారు. రానున్న సాధారణ ఎన్నికల కోసం నోడల్ అధికారులను నియమించామని తెలిపారు. ఈమేరకు వారు విధులపై అవగాహన పెంపొందించుకుని ఎన్నికల ప్రవర్తన నియమావళి కచ్చితంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈసమావేశంలో డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్



అమరవీరుల కుటుంబాలను సన్మానిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మంమయూరిసెంటర్: సైనికుల స్ఫూర్తితో ఎంచుకున్న రంగంలో విశిష్ట సేవలు అందించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ అన్నారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా బుధవారం అమర్ జవాన్ స్మృతి చిహ్నం వద్ద భారత జవాన్లకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్గిల్ యుద్ధ విజయం మన దేశ సైన్యం గొప్పతనమని, ప్రతికూల పరిస్థితుల్లో ప్రాణాలను పణంగా పెట్టారని గుర్తు చేశారు. కాగా, సైనిక సంక్షేమ భవనం మొదటి అంతస్తు త్వరలో పూర్తిచేస్తామని తెలిపారు. అఅనంతరం అమర సైనికుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను సన్మానించారు. పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్, మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, కల్నల్ యాదవ్, కార్పొరేటర్ పగడాల శ్రీవిద్య, పగడాల నాగరాజు, మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఫ్రాన్సిస్, యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

స్టంట్ ఫెయిల్ అయింది..

- గుండెనొప్పితో బాధపడుతున్న వ్యక్తికే చెప్పిన వైద్యుడు
- తీవ్ర ఆందోళన మృతి.. బంధువుల ఆందోళన

ఖమ్మం వైద్యవిభాగం: ఓ డాక్టర్ నిర్వాకం కారణంగా నిండు ప్రాణం బలైంది. వైద్యసేవలు అందించి ప్రాణాలు కాపాడాల్సిన వైద్యుడి నిర్లక్ష్యంతో కుటుంబం పెద్దదిక్కును కోల్పోయింది. ఈ ఘటన ఖమ్మంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకోగా, మృతదేహంతో బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడుకు చెందిన రేపాల వీరయ్య(45) అనారోగ్యంతో బాధపడుతూ ఖమ్మం మయూరిసెంటర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి రాగా పరీక్షించిన వైద్యుడు గుండె సంబంధిత సమస్య ఉన్నందున స్టంట్ అవసరమని వెల్లడించారు. ఆతర్వాత ఆరోగ్యశ్రీ ద్వారా స్టంట్ వేశారని, మూడు రోజులకే తీవ్ర గుండెనొప్పి రావడంతో అదే ఆస్పత్రిలో చేర్పించారు. ఈసందర్భంగా స్టంట్ ఫెయిల్ అయిందని రూ.6 లక్షలు చెల్లించాలని సూచించాడు. అయితే, తీవ్ర గుండెనొప్పితో బాధపడుతున్న వీరయ్యకే ఈ విషయం చెప్పడంతో ఆయన మరింత ఆందోళనకు గురై మృతి చెందాడు. దీంతో ఆయన బంధువులు ఆస్పత్రి ఎదుట మతదేహంతో ఆందోళన చేపట్టారు. ఈవిషయం తెలుసుకున్న పోలీసులు చేరుకొని నచ్చచెప్పారు. అనంతరం ఆస్పత్రి యాజమాన్యం, మృతుడి బంధువులతో చర్చలు జరిపాక వారు ఆందోళన విరమించి వెళ్లారు.

కొత్తగూడెంలో డీఆర్ఎం తనిఖీలు



రుద్రంపూర్ ఆర్‌సీహెచ్‌పీలో పరిశీలిస్తున్న డీఆర్ఎం భరతేష్‌కుమార్, అధికారులు

కొత్తగూడెంఅర్బన్: భద్రాచలం రోడ్డు(కొత్తగూడెం) రైల్వే స్టేషన్‌లో దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ మేనేజర్(డీఆర్ఎం) భరతేష్‌కుమార్ జైన్ బుధవారం తనిఖీలు చేపట్టారు. ఇటీవల డీఆర్ఎం బాధ్యతలు చేపట్టిన ఆయన తొలిసారి కొత్తగూడెం వచ్చారు. తొలుత మణుగూరు, పాల్వంచ కేటీపీఎస్, రుద్రంపూర్‌లోని బొగ్గు లోడింగ్ పాయింట్లను పరిశీలించారు. ఆతర్వాత కొత్తగూడెం చేరుకున్న డీఆర్ఎం ఇక్కడి వసతులు, సమస్యలపై ఆరా తీశారు. కాగా, సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు డీఆర్ఎంను సన్మానించిపలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు.

ఆర్‌సీహెచ్‌పీని సందర్శించిన డీఆర్ఎం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (ఆర్‌సీహెచ్‌పీ)ను డీఆర్ఎం భరతేష్‌కుమార్ జైన్ బుధవారం తనిఖీ చేశారు. కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు ఆయనకు స్వాగతం పలకగా.. ఆర్‌సీహెచ్‌పీ నుండి రోజుకు ఎన్ని వ్యాగన్ల బొగ్గు రవాణా అవుతోందనే వివరాలను డీవైఎస్ఈ వెంకటేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. ఆతర్వాత ప్రీ వేబిన్ వద్ద వెళ్లి తనిఖీ చేశారు. అధికారులు కోటిరెడ్డి, వై.రఘురామిరెడ్డి, సామ్యూల్ సుధాకర్, రామకృష్ణ, విశ్వేశ్వరరావు, అజ్మీరా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన ఏపీ మహిళ

మధిరలో రక్షించిన రెస్క్యూ టీం



జైనాబీ(మధ్యలో)తో రామకృష్ణ - జ్యోతి దంపతులు

మధిర: కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్యకు యత్నించిన ఓ మహిళను ఖమ్మం జిల్లా మధిరకు చెందిన రెస్క్యూ టీం కాపాడింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం తోటరాములపాడుకు చెందిన జైనాబీ కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకోవాలని మధిర సమీపంలోని వైరా నదిపై ఉన్న రాయపట్నం బ్రిడ్జి వద్దకు చేరుకుంది. బ్రిడ్జి పైనుంచి నదిలోకి దూకే యత్నం చేస్తుండగా సమీపాన ఉన్న ఆర్కే ఫౌండేషన్, రెస్క్యూ టీం నిర్వాహకులు దోర్నాల రామకృష్ణ, జ్యోతితో పాటు జర్నలిస్ట్ రాజేష్ గమనించి అడ్డుకున్నారు. తనకు మాటలు పూర్తిస్థాయిలో రావని, ముగ్గురు పిల్లలు ఉండగా.. భర్త మస్తాన్ పెట్టే చిత్రహింసలు భరించలేక ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీంతో విషయాన్ని ట్రెయినీ ఐపీఎస్ అవినాష్ కుమార్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన జైనాబీ కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు.

సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సమ్మె

ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసఫ్



సమ్మెకు సంఘీబావం తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

బోనకల్: గ్రామపంచాయతీల్లో తక్కువ జీతంతో చేయించుకుంటున్న వెట్టిచాకిరి నుండి కార్మికులకు విముక్తి లభించేంత వరకు సమ్మె ఆగదని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.యూసఫ్ తెలిపారు. జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం 21వ రోజుకు చేరగా, బోనకల్‌లో సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా కార్మికులు చేస్తున్న సమ్మెను ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఇకనైనా జీఓ 51ను సవరించి మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని, పీఆర్సీ ఆధారంగా కార్మికులను రూ.19,500 జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బి.వెంకటరాజ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులుతో పాటు వీరబాబు, మల్లయ్య, నరేందర్‌రెడ్డి, మరీదు పుల్లయ్య, యంగల ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

చెల్లెలిని హత్య చేసిన అన్న అరెస్టు

ఇల్లెందురూరల్: యువతిని రోకలిబండతో మోది హత్య చేసిన ఆమె అన్నను అరెస్టు చేసినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. సెల్‌ఫోన్ వినియోగం విషయంలో తన చెల్లెలు సింధుతో చోటుచేసుకున్న ఘర్షణలో అన్న హరిలాల్ రోకలిబండతో మోదడంతో ఆమె ఆపస్మారక స్థితిలోకి వెళ్లిందని, వెంటనే ఆస్పత్రికి తరలించినప్పటికి ఫలితం లేకుండా పోయిందని సీఐ చెప్పారు. విషయం బయటపడకుండా కింద పడటం వల్ల జరిగిన ఘటనగా చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో పత్రికల ద్వారా విషయం తెలియడంతో విచారణ చేపట్టామని, తమ కుమారుడు హరిలాల్ కొట్టడం వల్లే సింధు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో విచారణ ప్రారంభించామని తెలిపారు. పరారీలో ఉన్న హరిలాల్ బుధవారం పోలీసుల వద్ద లొంగిపోయి వాస్తవాన్ని అంగీకరించాడని వివరించారు. హరిలాల్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

– అవయవదానం చేసిన కుటుంబీకులు



తాళ్ల శ్రీను (ఫైల్)

కల్లూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కల్లూరు మండలం ఎర్రబోయినపల్లికి చెందిన తాళ్ల శ్రీను(36) ఈనెల 22న పెనుబల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా అక్కడ చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. ఈమేరకు చికిత్స పొందుతుండగా బ్రెయిన్‌డెడ్ అయింది. దీంతో అవయదదాన్ సభ్యుల సూచనలతో కుటుంబసభ్యులు అవయవదానానికి ముందు కు రాగా మంగళవారం సాయంత్రం హైదరాబాద్ తరలించారు. అక్కడ ప్రక్రి య పూర్తయ్యాక బుధవారం స్వస్థలానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, శ్రీనుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉండగా, ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రఘు తెలిపారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ఖమ్మంరూరల్: ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. గుర్తు తెలియని వ్యక్తి (35) తన ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో ద్విచక్రవాహనం గొల్లగూడెం వద్దకు రాగానే ఇంకో వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు.

బీఆర్ఎస్‌లో అలజడి

- కొత్తగూడెం నుంచి పోటీకి గులాబీ నేతల క్యూ
- హైకోర్టు తీర్పుతో కంగుతిన్న ఆశావహులు
- డోలాయమానంలో గడల రాజకీయ భవిష్యత్
- తీర్పుపై చర్చోపచర్చల్లో వనమా వర్గం
- అభివృద్ధిని పట్టాలు ఎక్కిస్తానంటున్న 'జలగం'

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ హైకోర్టు మంగళవారం వెలువరించిన తీర్పు జిల్లా రాజకీయాల్లో సంచలనంగా మారింది. బీఆర్ఎస్ అధిష్టానం ఈ అంశంపై అచితూచి వ్యవహరిస్తోంది. హైకోర్టు తీర్పును సవాల్ చేసే ప్రయత్నాల్లో వనమా వర్గం ఉండగా, అదే తీర్పును అమల్లో పెట్టాలంటూ జలగం సంబంధిత అధికారులను కలుస్తున్నారు. మరోవైపు కొత్తగూడెం నుంచి కారు గుర్తుపై పోటీ చేయాలని గంపెడాశలు పెట్టుకున్న నేతల ఆశలపై హైకోర్టు తీర్పు నీళ్లు చల్లినట్లయింది.

తారుమారు

గత ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ తరఫున పోటీ చేసిన జలగం వెంకట్రావు ఓటమి పాలవ్వగా వనమా కాంగ్రెస్ నుంచి గెలిచారు. అయితే అందరి అంచనాలను తారుమారు చేస్తూ వనమా వెంకటేశ్వరరావు కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరారు. దీంతో నియోజకవర్గంలో ఇద్దరు నేతలు ఉండగా, మూడో వ్యక్తికి ఇక్కడ అవకాశం దొరకడం దుర్లభం అనే పరిస్థితి ఉండేది. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత జలగం వెంకట్రావు నియోజకవర్గంలో పెద్దగా హడావుడి చేసింది లేదు. అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తూ వచ్చారు. మరోవైపు వనమా రాఘవపై పోలీస్ కేసులు నమోదు కావడంతో సీన్ మారిపోయింది.

హడావుడి చేస్తున్న గడల

జలగం పెద్దగా నియోజకవర్గానికి రాకపోవడం, మరోవైపు వనమా కుటుంబంపై కేసులు – వయోభారాన్ని సాకుగా చూపుతూ కొత్తగూడెం సీటు నుంచి పోటీ చేసేందుకు చాలా మంది ఉత్సాహం చూపించారు. వీరందరినీ వెనక్కి నెడుతూ హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు ముందు వరుసలోకి వచ్చారు. జీఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాల పేరుతో రాజకీయ ప్రణాళికను అమల్లో పెట్టారు. సెలవు చిక్కితే చాలు కొత్తగూడెంలో వాలిపోతూ సిట్టింగ్ ఎమ్మెల్యే వనమాపై విమర్శలు చేస్తూనే మరోవైపు సీఎం కేసీఆర్‌పై పొగడ్తల వర్షం కురిపిస్తూ వచ్చారు. కేవలం ఏడాది వ్యవధిలోనే గడల పేరు అందరి నోళ్లలో నానే స్థాయికి చేరుకున్నారు.

కొద్దిరోజులుగా వద్దిరాజు..

పొంగులేటి శ్రీనివాసరెడ్డి కొత్తగూడెం నుంచి కాంగ్రెస్ తరఫున బరిలో ఉంటారని, ఆయనకు సమర్థంగా ఎదుర్కొనే అభ్యర్థి రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అంటూ కొంతకాలంగా కొత్త ప్రచారం ఊపందుకుంది. దీంతో కొత్తగూడెం నుంచి కారులో ఎవరికి బెర్త్ దక్కుతుందనేది ఆసక్తికరంగా మారింది. తాజాగా హైకోర్టు తీర్పుతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఊహించని విధంగా జలగం వెంకట్రావు తెరమీదకు వచ్చారు. నిన్నా మొన్నటి వరకు గులాబీ పార్టీ నుంచి జలగం బరిలో ఉంటారా లేదా అనే స్థాయి నుంచి ఆయనే ఉంటారనే పరిస్థితి నెలకొంది. దీంతో కొత్తగూడెం టికెట్‌పై ఆశలు పెట్టుకున్న నేతలకు ఈ తీర్పు పిడుగుపాటులా మారిందనే అభిప్రాయం నియోజవర్గంలో వ్యక్తమవుతోంది. ముఖ్యంగా గడల శ్రీనివాసరావు భవిష్యత్ కార్యాచరణ ఎలా ఉంటుందనే చర్చ మొదలైంది.

అధిష్టానం ఆరా

కొత్తగూడెం నియోజవర్గంలో పార్టీ పరిస్థితులపై ఎప్పటికప్పుడు బీఆర్ఎస్ అధిష్టానం ఆరా తీస్తోంది. రాబోయే ఎన్నికల్లో ఇక్కడ అనుసరించాల్సిన వ్యూహంపై ఇప్పటికే చర్చ మొదలైంది. హైకోర్టు ఇచ్చిన తీర్పుతో నష్టపోయిన, లాభపడిన ఇద్దరు వ్యక్తులు బీఆర్ఎస్ పార్టీకి చెందినవారే కావడంతో పరిస్థితి సున్నితంగా మారింది. దీంతో పార్టీ తరఫున హడావుడిగా ప్రకటనలు చేయకుండా అన్ని అంశాలను నిశితంగా పరిశీలించిన తర్వాతే ముందుకు వెళ్లాలనే నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అందువల్లే కోర్టు తీర్పు పట్ల జలగం, వనమా వర్గీలు తప్పితే పార్టీ పరంగా మిగిలినవారేవరు ఇప్పటివరకు స్పందించలేదు. మరోవైపు తీర్పు వెలువడిన తర్వాత ప్రగతి భవన్ నుంచి వనమాకు ఫోన్ వెళ్లినట్టు సమాచారం. రాజకీయాల్లో లాంటి పరిణామాలు సహజమేనని అన్నింటిని తట్టుకుని ముందుకు వెళ్లాలని సీఎం కేసీఆర్ వనమాకు సూచించినట్టు తెలుస్తోంది. గడ్డుకాలంలో వనమాకు పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చినట్టు వనమా వర్గం నేతలు చెబుతున్నారు.

ప్రజల నుంచి వేరు చేయలేరు



ఎన్ని అవాంతరాలు ఎదురైనా కొత్తగూడెం ప్రజల నుంచి తనను ఎవరూ వేరు చేయలేరు. వార్డు సభ్యుని నుంచి మంత్రి స్థాయికి ఎదిగిన నాకు అధికారం, పదవులు కొత్త కాదు. గెలిచినపుడు ప్రజలతో ఉంటూ, ఓడినప్పుడు ప్రజలకు దూరంగా ఉండటం అనేది వారికి ద్రోహం చేసినట్టే. రూ.వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడంతోపాటు పార్టీ పటిష్టతకు కూడా పాటు పడుతున్నాను. నియోజకవర్గంలో 80 శాతం మంది ప్రజాప్రతినిధులను గెలిపించుకున్నాను. మున్నూరుకాపు, బీసీ వర్గానికి చెందిన నాపై కుట్రలు చేశారు. ఏది ఏమైనా చివరి శ్వాస వరకు కేసీఆర్ అడుగుజాడల్లోనే నడుస్తాను.

– ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

చర్యలు మొదలయ్యాయి



కొత్తగూడెం ఎమ్మెల్యేగా 2018 డిసెంబర్ 12 నుంచి నన్ను గుర్తించాలని ఎన్నికల కమిషన్‌కు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. తీర్పు కాపీలను చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌కు అందించాను. అసెంబ్లీ స్పీకర్, సెక్రటరీలకు కూడా ఇచ్చాను. హైకోర్టు తీర్పును అనుసరించి తీసుకోవాల్సిన విధానపరమైన చర్యలు మొదలయ్యాయి. తుది అంకానికి చేరడానికి కొంత సమయం పట్టొచ్చు. నాలుగేళ్లుగా కొత్తగూడెంలో ఆగిపోయిన అభివృద్ధిని మళ్లీ పట్టాలెక్కిస్తాను. గతంలో నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ప్రారంభించిన పనులే ఇప్పటికీ పూర్తి చేయలేకపోయారు. ప్రజాజీవితంలో సమయం ఎంతుందన్నది కాదు, సంకల్పం ఎంత బలమైంది అనేది ముఖ్యం.

– జలగం వెంకట్రావు

కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాలాజీ



బాలాజీకి నియామకపత్రం అందజేస్తున్న భట్టి

వైరా/కొణిజర్ల: తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కొణిజర్ల మండలం లక్ష్మీపురానికి చెందిన బానోత్ బాలాజీనాయక్ నియమితులయ్యారు. ఈమేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి జారీ చేసిన నియమాకపత్రాన్ని బుధవారం ఆయనకు సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అందజేశారు. ఈ సందర్భంగా బాలాజీ తనను నియమించిన భట్టి విక్రమార్క, అన్వేష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సమస్యలపై పోరాడుతూనే కాంగ్రెస్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

వారధి పదిలమేనా ?!



జిల్లా కేంద్రంలోని కాల్వొడ్డు వద్ద మున్నేరుపై 110 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన బ్రిడ్జి శిథిలావస్థకు చేరుతోంది. బ్రిడ్జి నిర్వహణను యంత్రాంగం పట్టించుకోకపోవడంతో ఇరువైపులా గోడలపై రావి, మర్రి చెట్లు పెరుగుతున్నాయి. దీంతో బ్రిడ్జి బీటలు పడి ప్రమాదకరంగా మారింది. ప్రస్తుతం భారీగా వరద వస్తుండడంతో ఎప్పుడేం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్

క్లుప్తంగా...

ఐఎంఏ సైంటిఫిక్ కమిటీ కన్వీనర్‌గా డా.కిరణ్

సాక్షి, హైదరాబాద్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) తెలంగాణ రాష్ట్ర సైంటిఫిక్ కమిటీ కన్వీనర్‌గా డాక్టర్ కిరణ్ మాదల నియమితులయ్యారు. ఈ మేరకు ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బీఎన్ రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కమిటీకి చైర్మన్‌గా డాక్టర్ డీసీ తిరుపతిరావు, కో చైర్మన్‌గా డాక్టర్ శ్రీరంగ్ అబ్కారీ, సభ్యులుగా డాక్టర్లు శశికళారెడ్డి, రామనర్సింహారెడ్డి, ఎంఎస్ఎస్ ముఖర్జీ, టి.సుబ్రమణ్యేశ్వరరావు, పి.దత్తాత్రేయ, పవన్‌కుమార్, చిన్మయి రాత, ఎంవీ రావు, శ్రీభూషణ్ రాజు ఉన్నారు.

5 నుంచి రాష్ట్ర పీజీ మెడికల్ కౌన్సెలింగ్



సాక్షి, హైదరాబాద్: వచ్చే నెల 5వ తేదీ నుంచి మొదటి విడత రాష్ట్రస్థాయి కోటా మెడికల్ పీజీ (ఎండీ, ఎంఎస్, డిప్లొమా, ఎండీఎస్, పీజీ డీఎన్‌బీ) సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం తెలిపింది. జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) ఆదేశాల మేరకు ఆగస్టు 16 వరకు కౌన్సెలింగ్ జరుగనుంది. ఇందులో సీట్లు పొందినవారు 20, 21 తేదీల్లో చేరాలి. ఇక రెండో విడత కౌన్సెలింగ్ వచ్చే నెల 25 నుంచి సెప్టెంబర్ 6 వరకు నిర్వహించనున్నారు. వాటిల్లో సీట్లు పొందినవారు సెప్టెంబర్ 11, 12వ తేదీల్లో చేరాలి. ఇక మూడో విడత కౌన్సెలింగ్ సెప్టెంబర్ 16 నుంచి 26వ వరకు జరగనుంది. అందులో సీట్లు పొందినవారు సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ ఒకటో తేదీ మధ్య చేరాలి. స్ట్రే వేకెన్సీ (తుది విడత) కౌన్సెలింగ్ అక్టోబర్ 1 నుంచి పదో తేదీ వరకు జరుగుతుంది. అందులో సీట్లు పొందినవారు పదో తేదీనే చేరాల్సి ఉంటుంది. తరగతులు సెప్టెంబర్ 5 నుంచే జరుగుతాయని ఎన్ఎంసీ తెలిపింది.

ఓయూ దూరవిద్య ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ప్రొఫెసర్ జి.రామిరెడ్డి దూరవిద్య కేంద్రంలో 2023–24 విద్యా సంవత్సరానికి రెండేళ్ల ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఓయూ పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ. పాండురంగారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు osmania.ac.inలోచూడవచ్చని వివరించారు.

ఏఎన్ఎం పోస్టులు 1520

భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిన మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు

సాక్షి, హైదరాబాద్: వైద్యారోగ్యశాఖలో ఏఎన్ఎం (మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్–ఫిమేల్) పోస్టుల భర్తీకి ప్రకటన జారీ అయ్యింది. మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు సభ్యకార్యదర్శి గోపీకాంత్‌రెడ్డి బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు సమర్పించాలి. రాతపరీక్ష ఇంగ్లిష్‌లో ఉంటుంది. పేస్కేల్ రూ. 31,040 నుంచి రూ.92,050 మధ్య ఉంటుంది. బహుళ ఐచ్ఛిక ఎంపిక విధానంలో రాతపరీక్ష ప్రాతిపదికన ఓఎంఆర్ లేదా కంప్యూటర్ ఆధారిత పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అయితే ఈ రెండు పద్ధతుల్లో ఏ విధంగా పరీక్ష నిర్వహిస్తారన్న దానిపై త్వరలో వెల్లడిస్తామని గోపీకాంత్‌రెడ్డి తెలిపారు. దరఖాస్తు రుసుము రూ. 500, ప్రాసెసింగ్ ఫీజు రూ.200 చెల్లించాల్సి ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, పీహెచ్ తదితర కేటగిరీలకు మినహాయింపు ఉంటుంది.

మొత్తం పోస్టులు: 1520 (ఫిమేల్)
దరఖాస్తుల స్వీకరణ: వచ్చేనెల 25న ఉదయం 10:30 నుంచి
దరఖాస్తులకు చివరి తేదీ : సెప్టెంబర్ 19వ తేదీ సాయంత్రం 5:30 వరకు
పరీక్ష కేంద్రాలు : హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్

ఇవీ అర్హతలు:

- అభ్యర్థులు తప్పనిసరిగా మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (ఫిమేల్) ట్రైనింగ్ కోర్సు చేసి ఉండాలి. లేదా ఇంటర్‌లో మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (ఫిమేల్) శిక్షణ కోర్సు పాసై ఉండాలి.
- తెలంగాణ రాష్ట్ర నర్సెస్ అండ్ మిడ్ వైఫ్స్ కౌన్సిల్‌లో రిజిస్టర్ చేసుకొని ఉండాలి.
- నిర్ధారించిన ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏడాదిపాటు క్లినికల్ ట్రైనింగ్ చేసి ఉండాలి. లేదా గుర్తించిన ఆస్పత్రుల్లో ఏడాది అప్రెంటిషిప్ పూర్తి చేసి ఉండాలి. వారు తెలంగాణ పారామెడికల్ బోర్డులో రిజిస్టర్ చేసుకొని ఉండాలి. ఎవరైనా అభ్యర్థి ఈ అర్హతలకు సమానమైన ఇతర అర్హతలను కలిగి ఉంటే, ఆ విషయాన్ని బోర్డు ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీకి రిఫర్ చేస్తారు. ఆ కమిటీ నివేదిక ఆధారంగా బోర్డు తుది నిర్ణయం తీసుకుంటుంది.
- దరఖాస్తుదారులు 18 – 44 ఏళ్ల మధ్యలో ఉండాలి. వివిధ వర్గాలకు సంబంధించి వారికి ప్రభుత్వం నిర్ణయించిన వయోపరిమితి సడలింపులు వర్తిస్తాయి.



- పరీక్షలో మార్కులకు గరిష్టంగా 80 పాయింట్లు ఉంటాయి. వైద్యారోగ్యశాఖలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేసిన/చేస్తున్న వారికి గరిష్టంగా 20 పాయింట్ల వరకు అదనంగా ఇస్తారు.
- గిరిజన ప్రాంతాల్లో సేవలు అందించినవారికి ప్రతి 6 నెలలకు 2.5 పాయింట్ల చొప్పున, గిరిజనేతర ప్రాంతాల్లో అయితే 2 పాయింట్ల చొప్పున కేటాయిస్తారు.
- కాంట్రాక్టు/ఔట్‌సోర్సింగ్ అనుభవమున్నవారు ధ్రువీకరణపత్రాన్ని పొందిన తర్వాత ఆ వివరాలతో దరఖాస్తు చేసుకోవాలి.
- కాంట్రాక్టు/ఔట్‌సోర్సింగ్ ఏ సేవలు అందించి ఉంటే, ఆ కేటగిరీ పోస్టులకు మాత్రమే పాయింట్లు వర్తింపజేస్తారు.

అప్‌లోడ్ చేయాల్సినవి :

అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తులో వివరాలు నమోదు చేయడంతోపాటు అవసరమైన పత్రాల సాఫ్ట్ కాపీ (పీడీఎఫ్)లను అప్‌లోడ్ చేయాలి. ఆధార్ కార్డ్, పదోతరగతి సర్టిఫికెట్, అర్హత సాధించిన కోర్సులకు చెందిన సర్టిఫికెట్లు ఉండాలి. అనుభవ ధ్రువీకరణ పత్రం (వర్తిస్తే), స్థానికత గుర్తింపు కోసం 1 నుంచి 7వ తరగతి వరకు చదివిన సర్టిఫికెట్లు లేదా నివాస ధ్రువీకరణపత్రం, ఎస్సీ, ఎస్టీ, బీసీలైతే కులధ్రువీకరణ పత్రం, బీసీల విషయంలో తాజా నాన్–క్రీమీలేయర్ సర్టిఫికెట్, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కోరేవారు తాజా ఆదాయం, ఆస్తి సర్టిఫికెట్, స్పోర్ట్స్ సర్టిఫికెట్, సదరం నుంచి దివ్యాంగ సర్టిఫికెట్, ఎన్‌సీసీ ధ్రువీకరణపత్రం వంటివి అవసరాన్ని బట్టి జత చేయాల్సి ఉంటుంది.

జోన్లవారీగా స్థానికులకు 95 శాతం రిజర్వేషన్

ఏఎన్ఎం పోస్టులను జోన్లవారీగా భర్తీ చేస్తారు. ఆయా జోన్ల అభ్యర్థులకే 95% పోస్టులు కేటాయిస్తారు. మిగతావి ఓపెన్ కేటగిరీలో భర్తీ చేస్తారు.

- జోన్–1 (కాళేశ్వరం)లో ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి,ములుగు జిల్లాలు.
- జోన్–2 (బాసర)లో ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల
- జోన్–3 (రాజన్న)లో కరీంనగర్, సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి
- జోన్–4 (భద్రాద్రి)లో కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, హనుమకొండ, వరంగల్
- జోన్–5(యాదాద్రి)లో సూర్యాపేట, నల్లగొండ, భువనగిరి, జనగాం
- జోన్–6(చార్మినార్)లో మేడ్చల్ మల్కాజిగిరి, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్
- జోన్–7(జోగులాంబ)లో మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగుళాంబ–గద్వాల, వనపర్తి, నాగర్ కర్నూల్ జిల్లాలున్నాయి.

వివిధ జోన్లు, కేటగిరీల వారీగా పోస్టుల వివరాల పట్టిక...

కేటగిరీ	జోన్–1	జోన్–2	జోన్–3	జోన్–4	జోన్–5	జోన్–6	జోన్–7	మొత్తం
ఓసీ	49	68	78	72	71	56	57	451
ఈడబ్ల్యూఎస్	18	23	27	24	25	19	21	157
బీసీ–ఏ	14	16	20	17	19	14	13	113
బీసీ–బీ	15	21	25	23	23	18	21	146
బీసీ–సీ	2	3	2	3	2	2	1	15
బీసీ–డీ	12	15	19	16	16	14	13	105
బీసీ–ఈ	7	9	11	9	10	8	7	61
ఎస్సీ	25	33	38	35	35	27	29	222
ఎస్టీ	17	23	27	24	25	20	21	157
స్పోర్ట్స్	3	4	5	4	5	3	4	28
ఓహెచ్	7	10	11	10	10	8	9	65
మొత్తం	169	225	263	237	241	189	196	1520

ఓహెచ్: ఆర్థోపెడిక్ హ్యాండిక్యాప్

'పల్లెవెలుగు'లో మరో రాయితీ టికెట్

30 కి.మీ. పరిధిలో రూ.50కే రానుపోను సదుపాయం

సాక్షి, హైదరాబాద్: గ్రామీణ ప్రాంతాల్లో ఆటోల్లో వెళ్లే ప్రయాణికులను బస్సుల వైపు మళ్లించేందుకు ఆర్టీసీ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కొత్తగా పల్లె వెలుగు బస్సుల్లో 30 కి.మీ. దూరం ప్రయాణించే వారికి రాయితీ టికెట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. కొద్ది రోజుల క్రితం సంస్థ టీ9–60 పేరుతో పల్లెవెలుగు బస్సుల్లో 60 కి.మీ. పరిధిలో తిరిగే ప్రయాణికులకు రూ.100కే రానుపోను రాయితీ టికెట్‌ను అందుబాటులోకి తెచ్చిన విషయం తెలిసిందే. దానికి స్పందన తక్కువగా ఉండటంతో, ఇప్పుడు టీ9–30 పేరుతో 30 కి.మీ. పరిధిలో తిరిగే వారికి రూ.50కే రానుపోను వర్తించేలా రాయితీ టికెట్‌ను ప్రారంభించింది. ఈ టికెట్లు గురువారం నుంచి కండక్టర్ల వద్ద అందుబాటులో ఉంటాయని ఆర్టీసీ వర్గాలు తెలిపాయి.

ఆటోల్లో ప్రయాణించేవారిపై గురి..

చాలా ప్రాంతాల్లో ప్రజలు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. పల్లెవెలుగు బస్సు టికెట్‌పై రాయితీ ప్రకటిస్తే వారిలో కొందరైనా బస్సులెక్కు తారని ఆర్టీసీ భావిస్తోంది. ప్రస్తుతం పల్లెవెలుగు బస్సుల్లో 30 కి.మీ. నిడివిలో ప్రయాణించే వారి సంఖ్య దాదాపు మూడున్నర లక్షలుగా ఉంది. అంతకు రెట్టింపు జనం అదే పరిధిలో ఆటోల్లో ప్రయాణిస్తున్నారు. ఇప్పుడు కొత్తగా తెచ్చిన రాయితీ టికెట్ తీసుకుంటే.. రూ.50తో గమ్యం వెళ్లితిరిగి రావచ్చు. దానికి అదనంగా రూ.20 చెల్లించి కాంబి టికెట్ తీసుకుంటే ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో కూడా అదే టికెట్‌తో రాను, పోనూ ప్రయాణించవచ్చు. కొద్ది రోజుల క్రితం 60 కి.మీ. నిడివిలో ప్రయాణించేవారికోసం రూ.100కే రానుపోను టికెట్ తీసుకురాగా, 60 కి.మీ. పరిధిలో తిరిగే ప్రయాణికుల సంఖ్య తక్కువగా ఉండటంతో దానికి పెద్దగా స్పందన రాలేదు. ఈ నేపథ్యంలో చాలా మంది డిపో మేనేజర్లు కోరటంతో కొత్త విధానం ప్రారంభించారు. ఉదయం 9 నుంచి రాత్రి 9 వరకు ఈ టికెట్ చెల్లుబాటులో ఉంటుంది. సాయంత్రం 6 వరకు టికెట్ల జారీ ఉంటుంది. 30 కి.మీ. పరిధిలో పొరుగు రాష్ట్రంలో ప్రయాణం ఉంటే.. అక్కడ కూడా ఇది చెల్లుబాటు (టీఎస్‌ఆర్టీసీ బస్సుల్లోనే) అవుతుందని అధికారులు ప్రకటించారు. ఈ కొత్త టికెట్‌కు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం బస్‌భవన్‌లో ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి, ఎండీ సజ్జనార్‌లు ఆవిష్కరించారు.

ఎంబీబీఎస్ అర్హుల జాబితా విడుదల

సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో కన్వీనర్ కోటా సీట్లకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల అర్హుల జాబితాను కాళోజీ నారాయణ రావు ఆరోగ్య విశ్వవిద్యాలయం బుధవారం విడుదల చేసింది. కన్వీనర్ కోటా సీట్ల కోసం దరఖాస్తు చేసిన అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించిన అనంతరం ఈ జాబితాను విడుదల చేసినట్లు కాళోజీ వర్సిటీ వర్గాలు వెల్లడించాయి. మొత్తం 22,167 మంది అర్హత సాధించారని వర్సిటీ తెలిపింది. అర్హత జాబితాపై ఎవరికైనా అభ్యంతరాలుంటే ఈ నెల 29న సాయంత్రం 4 గంటల్లోపు knrugadmission@gmail.comకు తెలియజేయాలని సూచించింది. కాగా, వెబ్ కౌన్సెలింగ్‌కు నోటిఫికేషన్ అనంతరం వీరు తమకు ఇష్టమైన కాలేజీలను ఎంపిక చేసుకోవచ్చని, వారికి వచ్చిన ర్యాంకు ఆధారంగా సీట్లను కేటాయించనున్నట్లు వెల్లడించింది.

'ఓఆర్ఆర్ లీజు' సమాచారం ఇవ్వడం లేదు

- గత నెల 14న దరఖాస్తు చేసినా అధికారులు స్పందించడంలేదు
- హైకోర్టులో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పిటిషన్



సాక్షి, హైదరాబాద్: నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) టోల్ నిర్వహణ బదిలీ (టీవోటీ)కి సంబంధించిన సమాచారాన్ని, సమాచార హక్కు చట్ట ప్రకారం కోరినా అధికారులు ఇవ్వడం లేదంటూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బుధవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గత నెల 14న దరఖాస్తు చేసినా ఇప్పటివరకు అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. అధికారుల తీరు ఆర్టీఐ చట్టంతో పాటు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 14ను కూడా ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొన్నారు. తాను మే 1న తొలిసారి దరఖాస్తు చేయగా, మే 23న అరకొర సమాచారం మాత్రమే ఇచ్చారని వివరించారు. దీంతో జూన్ 14న మరోసారి దరఖాస్తు చేశానన్నారు. ఓఆర్ఆర్ లీజు నివేదికలు, 30 ఏళ్లకు ఇవ్వడంపై మంత్రిమండలి నిర్ణయం, 2021–22, 2022–23 సంవత్సరాలలో ఆర్జించిన మొత్తం ఆదాయానికి సంబంధించి సమాచారం ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. లీజు పారదర్శకంగా జరిగిందా? లేదా? తెలుసుకోవడానికి ఈ సమాచారం కీలకం అన్నారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ముఖ్య కార్యదర్శి, హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్ఎండీఏ), హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ప్రజా సంబంధాల అధికారి, ఎండీ(ఎఫ్ఏసీ)లను ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఆర్టీఐ చట్టం ప్రకారం కోరిన సమాచారం ఇచ్చేలా ప్రతివాదులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. న్యాయవాది తేరా రజనీకాంత్‌రెడ్డి దాఖలు చేసిన ఈ పిటిషన్ నేడు లేదా రేపు విచారణకు రానుంది. ఓఆర్ఆర్ నిర్వహణ, టోలు వసూలు బాధ్యతలను 30 ఏళ్ల పాటు ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ లిమిటెడ్, ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వే లిమిటెడ్‌లకు అప్పగిస్తూ ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే.

జిల్లా వార్తలు

స్వీయ నియంత్రణతోనే ప్రమాదాల నివారణ

ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు

ఖమ్మంవ్యవసాయం: భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశమున్నందున.. ప్రతిఒక్కరూ స్వీయ నియంత్రణ పాటించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు సూచించారు. వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తడి చేతులతో ఇంట్లో విద్యుత్ పరికరాలను, తీగలను ముట్టుకోవద్దని, బట్టలు ఆరేసే దండాలకు విద్యుత్ వైర్లు తాకకుండా చూసుకోవాలని తెలిపారు. సమస్యలు ఎదురైతే నిపుణులతోనే మరమ్మతు చేయించాలని, సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టి మాట్లాడొద్దని సూచించారు. స్తంభం నుంచి ఇంట్లోకి వచ్చే సర్వీస్ వైర్లు రేకుల పందిర్లకు తాకకుండా చూడాలని, ఎవరైనా విద్యుదాఘాతానికి గురైతే రక్షించాలనే ఆతృతలో ముట్టుకోకుండా.. కర్ర, ప్లాస్టిక్ వస్తువులతో ఆ వ్యక్తిని వేరు చేయాలని తెలిపారు. పొలాల వద్ద రైతులు స్టార్టర్ల డబ్బాలు నీటిలో తడవకుండా కాపాడుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లో ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గరకు వెళ్లొద్దని చెప్పారు. వర్షాలు కురుస్తున్న సమయాన పిడుగులు పడే అవకాశమున్నందున చెట్ల కింద ఉండొద్దని సీఎండీ సూచించారు.

ఫిర్యాదులు ఉంటే..

విద్యుత్ సంబంధిత సమస్యలు, ఫిర్యాదులు తెలియజేయడానికిప్రత్యేక నంబర్లు కేటాయించినట్లు సీఎండీ గోపాల్‌రావు వెల్లడించారు. 1800 425 0028 లేదా 1912 నంబర్లతో పాటు ఖమ్మం విద్యుత్ సర్కిల్ కార్యాలయం కంట్రోల్ రూం నెంబర్ 94408 11525కు ఫోన్ చేయొచ్చని తెలిపారు.

శైవాగమ పండితుడు కృష్ణశర్మకు సన్మానం



కృష్ణశర్మను సన్మానిస్తున్న పీఠాధిపతి

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంలోని శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి దేవస్థానం అర్చకులు, శైవాగమ పండితులు దాములూరి కృష్ణశర్మను అవధూత దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానందస్వామి, విజయానంద తీర్థస్వామి సన్మానించారు. హైదరాబాద్ లోని దత్తపీఠం శ్రీ గణపతి సచ్చిదానందం ఆశ్రమంలో మంగళవారం జరిగిన సదస్సుకు రాష్ట్ర నలుమూలల నుంచి పండితులను ఆహ్వానించి సత్కరించారు. ఇందులో ఖమ్మం నుంచి కృష్ణశర్మ కూడా ఉన్నారు.

సింగరేణి వ్యాప్తంగా నిలిచిన బొగ్గు ఉత్పత్తి

బొగ్గు ఉత్పత్తి, ఓబీ వెలికితీతకు విఘాతం

సింగరేణి(కొత్తగూడెం)/సత్తుపల్లిరూరల్: రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా సింగరేణిలో సుమారు 5.69 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. ఈ తొమ్మిది రోజుల్లో 13,74,944 టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉండగా, 8,05,056 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి మాత్రమే నమోదైంది. అలాగే, 111.8 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీకి గాను 12.29 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ(10.99శాతం) వెలికి తీయగలిగారు. ఇక భూగర్భ గనుల్లో 1,91,604 లక్షల టన్నుల బొగ్గుకు గాను 1,13,811 లక్షల టన్నుల (59 శాతం) బొగ్గు ఉత్పత్తి జరిగింది. వర్షాలతో సింగరేణివ్యాప్తంగా 18 ఓపెన్‌కాస్ట్ గనుల్లో భారీగా వర్షం నీరు చేరగా హాల్‌రోడ్లన్నీ బురదమయ్యాయి. దీంతో ఉత్పత్తి పడిపోయి సీహెచ్‌సీలన్నీ వెలవెలబోతున్నాయి. క్వారీల్లో డంపర్లు, డోజర్లు ఎక్కడికక్కడే నిలిచిపోగా, వర్షపు నీటిని ప్లాన్‌టూన్ పంపుల ద్వారా తొలగిస్తున్నారు.



సత్తుపల్లిలోని జేవీఆర్ ఓసీలో నిలిచిన వర్షపు నీరు

రక్షణ చర్యలు చేపట్టాకే ఉత్పత్తిపై దృష్టి

- డీవైడీజీఎంఎస్ భూషణ్‌ప్రసాద్
- ఇల్లెందులో త్రైపాక్షిక భద్రతా సమావేశం



మాట్లాడుతున్న డీవైడీజీఎంఎస్ భూషణ్‌ప్రసాద్

ఇల్లెందు: సింగరేణిలో ఉత్పత్తి కీలకమే అయినా.. తొలుత కార్మికుల రక్షణ చర్యలు చేపట్టాకే ఉత్పత్తిపై దృష్టి సారించాలని డీవైడీజీఎంఎస్ భూషణ్‌ప్రసాద్ సూచించారు. సింగరేణి సంస్థ పరిధిలోని ఇల్లెందు ఏరియాలో 16వ త్రైపాక్షిక భద్రతా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భూషణ్‌ప్రసాద్‌తో పాటు సింగరేణి డైరెక్టర్ (పీపీ) జి.వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. తొలుత రక్షణ ప్రతిజ్ఞ చేశాక గని ప్రమాదాల్లో మృతి చెందిన ఉద్యోగుల జ్ఞాపకార్థం రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం 15వ త్రైపాక్షిక భద్రత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా డీవైజీఎంఎస్ భూషణ్‌ప్రసాద్ మాట్లాడుతూ సమావేశాల దృష్టికి వచ్చిన ప్రతీ సమస్య, పరిష్కారంపై చర్చించాల్సి ఉందన్నారు. ఇల్లెందు ఏరియా ప్రమాద రహితంగా ఉండడంపై అభినందించారు. సమావేశంలో అధికారులు ఉమేశ్, ఎం.సవర్కర్, ఎస్.ఆనంద్‌వాల్, ఎస్‌జీ బైసారే, డాక్టర్ జార్జ్‌జాన్, కమలేశ్‌కుమార్ వర్మ, సనత్‌కుమార్, దిలీప్‌కుమార్, రాజీవ్ ఓం ప్రకాష్, గౌరవ్ లడ్డా, కె.గురువయ్య, కుమారస్వామి, జాన్ ఆనంద్, యూనియన్ ప్రతినిధులు ఎస్.రంగనాథ్, కె.సారయ్య, లింగాల జగన్నాథం, సిరాజ్ అహ్మద్, సైదులు, శుక్లాల్ పాల్గొన్నారు.

సింగరేణిలో 14 మంది అధికారుల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ పరిధిలో వివిధ విభాగాలకు చెందిన 14 మంది అధికారులను బుధవారం బదిలీ చేశారు. కార్పొరేట్ ఎస్టేట్స్ విభాగం జనరల్ మేనేజర్ రవిప్రసాద్‌ను బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్‌గా, ఒడిశాలోని నైనీ జనరల్ మేనేజర్ సురేశ్‌కుమార్‌ను కార్పొరేట్ ఎస్టేట్స్ జీఎంగా, బెల్లంపెల్లి ఏరియా జీఎం గాజర్ల దేవేందర్‌ను మార్కెటింగ్ మేనేజర్ జీఎంగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అలాగే, ఈ అండ్ ఎం విభాగంలో 9 మంది అధికారులను కూడా బదిలీ చేయగా, వారిలో నలుగురు జీఎంలు, ఐదుగురు డీజీఎంలు ఉన్నారు. ఇంకా పర్సనల్ విభాగంలో ఒక డీజీఎం, ఒక సీనియర్ పీఓను సైతం బదిలీ చేశారు.

ఈఎస్ఐ అసిస్టెంట్ కమిషనర్‌గా సింగరేణి అధికారి

మురళీధర్‌కు మూడేళ్ల పాటు డిప్యూటేషన్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఎస్ఓటూ డైరెక్టర్ పా(పర్సనల్)గా విధులు నిర్వర్తిస్తున్న అడపాల మురళీధర్‌రావు హరియాణా రాష్ట్రంలోని ఫరిదాబాద్‌లో ఉన్న ఈఎస్ఐ విభాగానికి అసిస్టెంట్ కమిషనర్, రీజియన్ డైరెక్టర్‌గా ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయనను బుధవారం రిలీవ్ చేశారు. సింగరేణిలో వెల్ఫేర్ ఆఫీసర్‌గా 1996లో బాధ్యతలు చేపట్టిన ఆయన అంచెలంచెలుగా ఎదిగారు. ఇటీవల చేపట్టిన నియామకాల్లో ప్రతిభ చాటిన మురళీధర్ ఈఎస్ఐ అసిస్టెంట్ కమిషనర్‌గా ఎంపికయ్యారు. కాగా, డిప్యూటేషన్‌పై వెళ్తున్న మురళీధర్‌ను సింగరేణి ప్రధాన కార్యాలయంలోని డైరెక్టర్ (పా) ఎన్.బలరామ్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధికారులు బసవయ్య, హన్మంతరావు, వెంకటేశ్వరరావు, కవితానాయుడు, ధన్‌పాల్ శ్రీనివాస్, సునీల, ఆనంద్ సుధాకర్, రాహుల్ పాల్గొన్నారు. అనంతరం మురళీధర్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ప్రోత్సాహంతో ఈ పోస్టుకు ఎంపికయ్యానని తెలిపారు. తన తల్లిదండ్రులు సీఎంపీఎఫ్ (సింగరేణి మైన్స్ ప్రావిడెంట్ ఫండ్)లో చిరుద్యోగులుగా పనిచేస్తూ తనను చదివించారని చెప్పారు.



మురళీధర్‌రావును సన్మానిస్తున్న డైరెక్టర్ బలరామ్, అధికారులు

ఆస్తుల పరిరక్షణలో సెక్యూరిటీ విభాగమే కీలకం



మాట్లాడుతున్న డైరెక్టర్ బలరామ్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ఆస్తుల పరిరక్షణలో సెక్యూరిటీ విభాగం పాత్ర కీలకమని డైరెక్టర్(పా) ఎన్.బలరామ్ పేర్కొన్నారు. కొత్తగూడెంలోని కార్పొరేట్ కార్యాలయంలో సంస్థ పరిధిలోని 11 ఏరియాల సెక్యూరిటీ అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దొంగతనాలను అరికట్టేందుకు నిరంతరం గాలింపు చేపట్టాలని, కంపెనీ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా పరిశీలించాలని సూచించారు. అలాగే, కంపెనీ క్వార్టర్ల ఆక్రమణ జరగకుండా చూడాలని చెప్పారు. ఇదే సమయాన సిబ్బంది సంక్షేమంపై దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో సెక్యూరిటీ జీఎం దీక్షితులు, చీఫ్ సెక్యూరిటీ అధికారి శశిధర్‌రాజు, ఎస్ఓటూ జీఎం వేణుమాధవ్, కార్పొరేట్ సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ ఎండీ జాకీర్ హుస్సేన్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

జైపూర్‌లో ముగిసిన వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న సింగరేణి ఉద్యోగ సంఘం నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): రాజస్తాన్‌లోని జైపూర్‌లో ఈ నెల 24 నుంచి ఢిల్లీకి చెందిన ఇండస్ట్రియల్ మేనేజ్‌మెంట్ అకాడమీ ఆధ్వర్యాన జరుగుతున్న వర్క్‌షాప్ బుధవారం ముగిసింది. 'ఇంప్లిమెంటేషన్ రిజర్వేషన్ పాలసీ ఆన్ ఎస్సీ, ఎస్టీ'అంశంపై జరిగిన ఈ వర్క్‌షాప్‌లో సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం నుంచి సెంట్రల్ కమిటీ సభ్యులు, 11 ఏరియాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం నాయకుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ రిజర్వేషన్ల అమలుపై ఆరు నెలలకోసారి శిక్షణ తరగతులు నిర్వహించాల్సి ఉన్నా కరోనా కారణంగా జరగడం లేదన్నారు. మళ్లీ ఇప్పుడు తరగతులు ఏర్పాటు చేశారని, ఈ సందర్భంగా రిజర్వేషన్ల అమలు, ఇతర అంశాలపై అకాడమీ బాధ్యులు అవగాహన కల్పించాలని తెలిపారు.

రామయ్య హుండీ ఆదాయం రూ.1.70కోట్లు



చిత్రకూట మండపంలో ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలోని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. ఈ సందర్భంగా 63 రోజులకు గాను రూ.1,70,49,637 ఆదాయం సమకూరింది. ఆలయ ఈఓ రమాదేవి, దేవాదాయ శాఖ అధికారుల సమక్షాన హుండీలను చిత్రకూట మండపానికి తరలించి లెక్కించారు. ఈమేరకు రూ.1,70,49,637 నగదు, 400 గ్రాముల బంగారం, 1.700 కేజీల వెండితో పాటు యూఎస్, ఇండోనేషియా, ఆస్ట్రేలియా, కెనడా తదితర దేశాల కరెన్సీ లభించిందని ఈఓ రమాదేవి వెల్లడించారు. ఆలయంలో ప్రవేశపెట్టిన నూతన పూజలతో పాటుగా వారాంతపు, సెలవు దినాల్లో భక్తుల రద్దీ కారణంగా ఆదాయం కూడా పెరిగిందని తలిపారు.